సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



వన్డే టోర్నీలో బౌలర్లదే హవా

కడపలో జరిగే ఏసీఏ అంతర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం నార్త్‌జోన్, సౌత్‌జోన్, నెల్లూరు జట్లు గెలిచాయి. -8లో..



నేరాల నియంత్రణపై దృష్టి

జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ కృష్ణారావు తెలిపారు. మదనపల్లె పర్యటనలో భాగంగా మంగళ వారం పలు స్టేషన్లను తనిఖీ చేశారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.98	రూ.120
రెండోరకం	రూ.56	రూ.94

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 324 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నల్లపరెడ్డిపల్లి సెక్రటరీ సస్పెన్షన్

పెనగలూరు: మండలంలోని నల్లపరెడ్డిపల్లి సెక్రటరీ లక్ష్మీదేవిని సస్పెండ్ చేస్తూ మంగళవారం ఎంపీడీఓ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. గతంలో సిబ్బందికి సెక్రటరీకి ఏర్పడిన సమస్యలపై కలెక్టర్‌కు సిబ్బంది ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో కలెక్టర్ సెక్రటరీపై ఆరాతీసి సస్పెండ్ చేస్తూ ఎంపీడీఓ కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు.

సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడిగా జాకీర్ హుస్సేన్

రాయచోటి: అన్నమయ్య జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులుగా డి. జాకీర్ హుస్సేన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏడాదిగా అన్నమయ్య జిల్లాలోని సాంఘీక సంక్షేమసాఖ సాధికారత అధికారిగా పనిచేస్తున్నారు. విజయవాడలోని సాంఘీక సంక్షేమసాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ నుంచి మంగళవారం సాంఘీక సంక్షేమశాఖ ఉపసంచాలకులుగా పదోన్నతి ఉత్తర్వులు జారీ అయినట్లు జాకీర్ హుస్సేన్ తెలిపారు. అంతకుముందు ఆయన జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు నందలూరులో 'జగనన్నకు చెబుదాం'

రాయచోటి: నందలూరు మండల పరిధిలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ గిరీషా పీఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యలకు మెరుగైన, వేగవంతమైన పరిష్కారం కోసం మండలస్థాయిలో అన్ని శాఖల అధికారుల సమక్షంలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులు పాల్గొనాలని వారు సూచించారు. తహశీల్దార్లకు, ఎంపీడీఓలకు, మున్సిపల్ కమిషనర్లకు, మండల స్పెషల్ ఆఫీసర్లకు ఈ కార్యక్రమం గురించి తగు సూచనలు జారీ చేశామని పేర్కొన్నారు.

అంగళ్లు కేసు తీర్పు రిజర్వ్

కురబలకోట: చంద్రబాబు నీటి ప్రాజెక్టుల సందర్శనకు వచ్చిన సమయంలో అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని అంగళ్లు కూడలిలో చెలరేగిన అల్లర్ల కేసుపై మంగళవారం హైకోర్టులో విచారణ కొనసాగింది. ఈకేసులో టీడీపీ అధినేత మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఏ1గా ఉన్న విషయం తెలిసిందే. ముదివేడు పోలీసులు నమోదు చేసిన ఈకేసులో బెయిల్ కోసం ఆయన రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై ఐదు రోజుల క్రితం విచారించిన హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. ఈ క్రమంలో మంగళవారం హైకోర్టులో ఇరుపక్షాల మధ్య ఉత్కంఠభరితంగా సాగిన వాదనలు ముగిశాయి. చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. స్కిల్ స్కాం కేసులో ఇప్పటికే చంద్రబాబు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం సర్వత్రా విదితమే.

బ్యాడ్మింటన్ ఆసియా పోటీలకు కోడూరు వాసి



విశ్వతేజను అభినందిస్తున్న విజయ్‌కుమార్

రైల్వేకోడూరు అర్బన్ : కోడూరు పట్టణానికి చెందిన గొబ్బూరు నరేంద్రబాబు కుమారుడు విశ్వతేజ అండర్–17 విభాగంలో ఆసియా బ్యాడ్మింటన్ జూనియర్ డబుల్స్‌కు ఎంపికయ్యాడు. మంగళవారం వాసవీ క్లబ్ రీజనల్ చైర్మన్ పెండ్యాల విజయ్ కుమార్ తల్లిదండ్రులను, విశ్వతేజను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 17–22 వరకు చైనాలోని చెంగ్డూ పట్టణంలో జరిగే బ్యాడ్మింటన్ ఏసియా అండర్–17 జూనియర్ విభాగంలో పాల్గొంటారన్నారు. కోశాధికారి కుమార్, కార్యదర్శి సత్య, వేమ కిషోర్, నరసయ్య, కలువా శేఖర్, వి కిరణ్, సుమన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహదానందం!



ఈమె పేరు పొత్తూరి అను సూయమ్మ, సంబేపల్లె మండలం ఎస్.సో వవరం గ్రామం. తనకు 1991లో అసైన్ మెంట్ ద్వారా సర్వే నెంబరు 377లో రెండు ఎకరాలకు పైగా భూమి ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటివరకు భూమి సాగు చేసుకుంటూనే ఉన్నారు. కానీ ఆన్‌లైన్‌లో మార్చుకునేందుకు, రిజిష్టర్ చేయించుకునేందుకు వీలు ఉండేది కాదు. ఇప్పుడు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో అమ్ముకునేందుకు కూడా అవకాశం లభించడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తోంది.

- జిల్లాలో అసైన్డ్ భూముల రెగ్యులరైజేషన్‌కు కేబినెట్ ఆమోదం
- 1,05,840 మంది రైతులకు ప్రయోజనం
- రైతులకు సంబంధించి 219595.39 ఎకరాల భూమికి విముక్తి
- అసైన్డ్ భూముల్లో ఎక్కువ శాతం దళితులకే ప్రయోజనం



సాక్షి రాయచోటి: ఎన్నో ఏళ్లుగా అమ్ముకోలేక....కొనలేక....ఆన్‌లైన్‌గాక అవస్థలు పడుతున్న అసైన్డ్ భూములకు మోక్షం లభించింది. కుటుంబంలో శుభకార్యాలు జరుగుతున్నా...ఏదైనా ఆస్పత్రికి వెళ్లాలన్నా...ఇతర ఎలాంటి పెద్ద అవసరమొచ్చినా అసైన్డ్ భూములను అమ్ముకోలేని పరిస్థితి. ఇలాంటి విపత్కర పరిస్థితుల నుంచి విముక్తి లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇదివరకే చుక్కల భూములకు పక్కా హక్కులు కల్పించిన విషయం విదితమే. తాజాగా అసైన్‌మెంట్ కమిటీల ద్వారా లక్షలాది మంది భూమి లేని నిరుపేదలకు పట్టాల ద్వారా భూ హక్కు కల్పించారు. దళితులకు సంబంధించిన భూములపై రుణాలు తీసుకుని చెల్లించకపోవడంతో వ్యవసాయం చేసుకోలేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఇటీవలే బ్యాంకులకు దళితుల తరపున రుణా లు చెల్లించి భూములపై సర్వహక్కులు దక్కేలా వీలు కల్పించారు. ప్రస్తుతం అసైన్‌మెంట్ ద్వారా డీ పట్టా లు పొంది 20 ఏళ్లు దాటిన భూములన్నింటికీ పూర్తి స్థాయిలో హక్కులు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు పాస్ చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 1,05,840 మంది రైతులకు ప్రయోజనం..

అన్నమయ్య జిల్లాలో 1993కు ముందు అసైన్‌మెంట్ ద్వారా డి.పట్టాలు పొందిన అనేక మంది రైతులకు భారీ ప్రయోజనం ఒనగూరనుంది. ఎప్పుడూ కనివినీ ఎరుగని రీతిలో ప్రభుత్వం వారికి పూర్తి స్థాయి హక్కులు కల్పించడంతో ఇకనుంచి రిజిస్ట్రేషన్లు మొదలు కొనుగోలు వరకు అన్నీ చేసుకునే వెసలుబాటు లభించింది. దీంతో కష్టాలు ఉన్నప్పుడు అమ్ముకునేందుకు, ఇతర ప్రయోజనాలు అనుభవించేందుకు ఆస్కారం లభించింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 1,05,840 మంది రైతులకు ప్రయోజనం ఒనగూరనుంది. వారికి సంబంధించి 219595.39 ఎకరాల భూమి నిషేధిత జాబితా నుంచి ప్రభుత్వం విడుదల చేసింది.

అణగారిన వర్గాలకే అధిక ప్రయోజనం

జిల్లాలో అసైన్డ్ భూములకు సంబంధించి అధిక శాతం ప్రయోజనం అణగారిన వర్గాల ప్రజలకే కలగనుంది. ప్రధానంగా దళితులు, గిరిజనులు, బీసీ వర్గాలకు ప్రయోజనం చేకూరనుంది. ఎస్సీలకు సంబంధించి 19,770 మందికిగాను 39,056 ఎకరాలు లభించగా, ఎస్టీలకు సంబంధించి 6741 మందికిగాను12,806 ఎకరాలకు పూర్తి స్వేచ్ఛ లభించింది. బీసీ వర్గాలకు సంబంధించి 36,943 మందికిగాను 70,763 ఎకరాలు, మైనార్టీలకు సంబంధించి 7691 మందికిగాను 16,393 ఎకరాలు, ఇతరులకు సంబంధించి 34,697 మందికిగాను 80,575 ఎకరాల అసైన్డ్ భూములకు పూర్తి స్థాయి హక్కులు ప్రభుత్వం కల్పించింది.

సంతోషకర విషయం



అసైన్‌మెంట్ కమిటీ ద్వారా మా భూములు మాకు దక్కడం ఎంతో సంతోషకరం. కొన్నేళ్లుగా మా భూములు ఆన్‌లైన్ కాక చాలా ఇబ్బందులు పడ్డాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన రీసర్వేతో మా భూములు మాకు దక్కడం ఎంతో సంతోషదాయకంగా ఉంది.
– ఆర్.భాస్కర్, కొత్తపల్లి గ్రామం, చిన్నమండెం మండలం

అసైన్‌మెంట్ కమిటీతో న్యాయం



సీఎం జగన్ ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేతో మా భూములు మాకు దక్కడంతో పాటు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా మాకు పట్టాదారు పాసుపుస్తకం కూడా అందజేశారు. అంతే కాకుండా ఆన్‌లైన్ చేయడం ద్వారా తమ భూమి మా పేరు మీద రావడం చాలా సంతోషంగా ఉంది. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని భూ సమస్య ప్రస్తుత ప్రభుత్వంలో అయింది.
– ఆకు తోట. శంకరయ్య, దేవగుడిపల్లె గ్రామం, చిన్నమండెం మండలం

ప్రభుత్వ నిర్ణయంతో భూములపై సర్వహక్కులు



రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అసైన్డ్ రైతులకు మంచి ప్రయోజనాలు ఒనగూరనున్నాయి. ఇప్పటివరకు నిషేధిత జాబితాలో ఉన్న భూములకు ప్రస్తుతం సర్వహక్కులు లభిస్తాయి. ఆ కుటుంబాలు ఏదైనా ఇబ్బందులు పడుతున్న తరుణంలో అమ్ముకునేందుకు అవకాశం లభించింది. రైతులు ఎన్నో ఏళ్లుగా ఇలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అసైన్డ్ రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపిస్తాయి.
– పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

నేడు బహుమతుల ప్రదానం

రాయచోటి: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. అన్నమయ్య జిల్లా అధికారి నాగభూషణం ఆధ్వర్యంలో పర్యాటక కేంద్రాలు, వాటి ప్రాముఖ్యత, టూరిజం అండ్ గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్ అనే అంశాలపై మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలలో అధ్యాపకులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను నేడు బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రధానం చేయనున్నట్లు జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం తెలియజేశారు. ఈ పోటీలలో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో కడప జిల్లా ప్రిన్సిపల్ జడ్జి



రంగమండపంలో ప్రిన్సిపల్ జడ్జి శ్రీదేవిని సత్కరిస్తున్న ఆలయ అర్చకులు

ఒంటిమిట్ట/నందలూరు: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఏకశిలపై వెలసిన సీతారామలక్ష్మణులను మంగళవారం కడప జిల్లా ప్రిన్సిపల్ జడ్జి శ్రీదేవి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ లాంఛనాలతో వారికి ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో మూల విరాట్‌కు జడ్జి పూజలు నిర్వహించారు. రంగమండపంలో స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నందలూరు సౌమ్యనాథ స్వామి సన్నిధిలో..

నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామిని మంగళవారం కడప జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.శ్రీదేవి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేశభక్తి నింపేలా... సృజనాత్మకత పెంచేలా.!

- విద్యార్థులకు నాలుగు విభాగాలుగా వీరగాథ–3 పోటీలు
- ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు

మదనపల్లె సిటీ: విద్యార్థుల్లో దేశభక్తి నింపడంతో పాటు వారిలోని సృజనాత్మకతకు పదును పెట్టేందుకు విద్యా మంత్రిత్వ, రక్షణ మంత్రిత్వ శాఖ ఆన్‌లైన్‌లో వీరగాథ–3 పోటీలు నిర్వహిస్తున్నాయి. మూడు నుంచి 12వ తరగతి విద్యార్థులకు పద్యాలు, కథలు, చిత్రలేఖనం, వ్యాసరచన, మల్టీ మీడియా ప్రదర్శన తదితర పోటీలు ఉన్నాయి. దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన వీరుల గాథలను వివరించేలా పోటీలు ఉంటాయి. ఇప్పటికే పలు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తుండగా ఈ నెల 30లోపు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది.

పోటీ అంశాలు ఇవే...!

వీరగాథ 3.0 పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమకు నచ్చిన అంశాలను ఎంచుకోవచ్చు. దేశం కోసం త్యాగం చేసిన వారిని ఆదర్శంగా ఎంచుకుని వారు అందుకున్న అవార్డులు, వారి నుంచి నేర్చుకున్న అంశాలు ప్రస్తావించాలి. అవకాశం వస్తే అతడి జ్ఞాపక శక్తిని సజీవంగా ఉంచేందుకు అవకాశం ఇస్తే ఆయన ఏం చేయదలుకున్నారో చెప్పాలి. ఝాన్సీలక్ష్మీబాయి కలలోకి వచ్చి దేశానికి సేవ చేయాలని కోరితే ఏం చేస్తారో వివరించవచ్చు. సిపాయిల తిరుగుబాటును ఆదర్శంగా తీసుకున్న స్వాతంత్య్ర సమరయోధుడి జీవిత కథ తనను ఏ విధంగా ప్రభావితం చేసిందో చెప్పాలి.



వీరగాథ–3 లో స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలో బాలాజీ నగర్ ప్రభుత్వ ఉర్దూ పాఠశాల విద్యార్థులు

నాలుగు విభాగాలుగా పోటీలు

- ఈ పోటీలు పాఠశాలల వారీగా నాలుగు విభాగాలుగా నిర్వహిస్తున్నారు. 3–5, 6–8, 9–10, 11–12 తరగతులవారిని వేర్వేరు కేటగిరీలుగా విభజించారు.
- 3–5 తరగతుల విద్యార్థులకు పద్యం, వ్యాసం (150 పదాలు), పెయింటింగ్, చిత్రలేఖనం
- 6–8 తరగతి విద్యార్థులకు పద్యాలు, వ్యాసం, పెయింటింగ్, చిత్రలేఖనం, మల్టీ మీడియా ప్రదర్శన
- 9,10 తరగతుల విద్యార్థులకు పద్యాలు, వ్యాసం , పెయింటింగ్, చిత్రలేఖనం, మల్టీ మీడియా ప్రదర్శన
- 11,12 తరగతుల విద్యార్థులకు పద్యాలు, వ్యాసం ,పెయింటింగ్, చిత్రలేఖనం, మల్టీ మీడియా ప్రదర్శన

నమోదు చేసుకోవడం ఇలా...

ఆసక్తిగల విద్యార్థుల వివరాలను ప్రధానోపాధ్యాయులు లేదా ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.https://innovateindia.mygov.in/veer-gatha-3/ వెబ్ లింక్‌లో నమోదు చేయాలి. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల నుంచి నాలుగు ఎంట్రీలను అప్‌లోడ్ చేయాలి.

సృజనాత్మకత పెంపొందుతుంది



పోటీల్లో పాల్గొనడంతో దేశభక్తి పెంపొందటంతోపాటు విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీయవచ్చు. భాషపై పట్టు పెరుగుతుంది. అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పిల్లలంతా పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి.
– శ్రీరాం పురుషోత్తం, డీఈఓ, అన్నమయ్య జిల్లా

మంచి అవకాశం



వీరగాథ–3 పోటీలను జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఇది విద్యార్థులకు మంచి అవకాశం. ఎవరికైనా సందేహాలుంటే ఆయా పాఠశాల హెచ్‌ఎంలను సంప్రదించాలి. –పద్మావతి, ఎంఈఓ–2, నిమ్మనపల్లె

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

రాయచోటి: అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి సూచించిన ప్రణాళిక ఆధారంగా నియోజకవర్గాల అభివృద్ధిని వేగవంతం చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అధ్యక్షతన జిల్లాలో నియోజకవర్గాల వారీగా మంగళవారం జరిగిన సమావేశాలలో వివిధ అంశాలకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలు వాటి కార్యాచరణపై కలెక్టర్ సమీక్షించారు. గాలివీడు మండలంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారంపై జిల్లా అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మచిలీపట్నం రైలు రద్దు

కలికిరి: మూడవ రైల్వే లైన్ పనుల వల్ల ధర్మవరం నుంచి మచిలీపట్నం స్పెషల్ ఫేర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును ఉన్నతాధికారులు 15 రోజుల పాటు రద్దు చేశారని కలికిరి రైల్వేస్టేషన్ మేనేజర్ మనోజ్ కుమార్ తెలిపారు. సోమ, మంగళ, గురు, శనివారాల్లో ధర్మవరం నుంచి మచిలీపట్నం స్పెషల్ (07096), ఆది, సోమ, బుధ, శుక్రవారం మచిలీపట్నం నుంచి ధర్మవరం వచ్చే స్పెషల్ (07095) వచ్చే నెల 10వ తేదీ వరకు రద్దు చేశారని, ప్రయాణికులు గమనించాలని ఆయన కోరారు.

కవిసమ్మేళనానికి ఆహ్వానం



పసుపులేటి శంకర్

రాజంపేట: తిరుపతిలో ఈనెల 30, అక్టోబరు 1లో నిర్వహించే భారతీయ భాషా కవిసమ్మేళనానికి రాజంపేట స్పెషల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ –2 పసుపులేటి శంకర్‌కు మంగళవారం ఆహ్వానం అందింది. తిరుపతి జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయం ప్రాంగణం సమావేశ మందిరంలో ఈ కవిసమ్మేళనం నిర్వహించనున్నారు. పలువురు ప్రముఖులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

వదలని వరుణుడు



కమలాపురం సమీపంలోని పాపాఘ్ని నదిలో ప్రవహిస్తున్న వరదనీరు

- వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు
- అత్యధికంగా జమల్మమడుగులో 62.4 ఎంఎం వర్షం
- కమలాపురం పాపాఘ్ని నది అప్రోచ్ రోడ్డుపై పొంగిపొర్లిన వరదనీరు

కడప అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో జిల్లా లోని పలు వంకలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. దీంతోపాటు కడప నగరంతోపాటు జిల్లాలోని పలు లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు వచ్చి చేరడంతో జనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజులుగా ప్రతి రోజు రాత్రిపూట వర్షాలు కురవడం తెల్లారంగానే ఎండలు కాయడం విశేషం. కాగా సోమవారం అర్థరాత్రి నుంచి జిల్లాలో వర్షం ప్రారంభమై మంగళవారం తెల్లవారుజామువరకు వర్షం ఏకధాటిగా కురిసింది. జిల్లాలోని జమ్మలమడుగులో 62.4 మిల్లీమీటర్లు అత్యధికంగా వర్షం కురిసింది. అలాగే కొండాపురంలో 57.2 ఎంఎం, సిద్దవటం, లింగాలలో 50.2 ఎంఎం వర్షం కురిసింది.

ఉద్యాన పంటలకు దెబ్బ..

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ఇప్పటికే జిల్లాలో ఖాజీపేట, లింగాల, పెండ్లిమర్రి మండలాల పరిధిలో 400 ఎకరాలకు పైగా చామంతి, కనకాంబరం, ఆరటి, దానిమ్మ, టమోట, ఉల్లి, మిరపతోపాటు పలు పంటల్లో వర్షపునీరు నిలిచి పంటలు దెబ్బతిన్నాయి. ఈ నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది.

మండలం కురిసిన వర్షం(మి.మీ)

జమ్మలమడుగు	62.4	ఎర్రగుంట్ల	19.4
కొండాపురం	57.2	పులివెందుల	19.2
లింగాల	50.2	వేంపల్లి	13.4
సిద్దవటం	50.2	మైదుకూరు	13.2
మైలవరం	20.6	సింహాద్రిపురం	10.8
కలసపాడు	20.4	చాపాడు	10.2
ఖాజీపేట	19.6	సికెదిన్నె	9.4

పాపాఘ్ని నది అప్రోచ్ రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు...

రెండు రోజులుగా జిల్లాలోని వేంపల్లి, వేముల, పెండ్లిమర్రి ప్రాంతాల్లో కురిసిన భారీవర్షాల కారణంగా కమలాపురం సమీపంలో పాపాఘ్ని నది ఉధృతంగా ప్రవహించింది. దీంతో కమలాపురం సమీపంలో పాపాఘ్ని నదిపై ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డుపై వరదనీరు ప్రహించింది. దీంతో ఎటువంటి ప్రమాదం జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలో భాగంగా మధ్యాహ్నం వరకు భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. భారీ వాహనాలను కమలాపురం మీదుగా రాకుండా ఖాజీపేట మీదుగా కడపకు మళ్లించారు. దీంతోపాటు కడప నుంచి కమలాపురం వైపుకు వచ్చే వాహనాలు రాకుండా కడప ఇర్కార్ సర్కిల్ వద్ద వాహనాలను నిలిపివేశారు. వరదనీరు తగ్గడంతో మధ్యాహ్నం తరువాత వాహన రాకపోకలను పునరుద్ధరించారు.

పక్కా ఓటరు జాబితాయే లక్ష్యం

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు పాటించి తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆర్డీఓలు, తహసీల్దార్‌లకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో ఓటర్ల జాబితా సవరణపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన ఫామ్స్‌లలో ఒక్కటి కూడా పెండింగ్ లేకుండా క్లియర్ చేసి రాజకీయ పార్టీ నాయకులు విమర్శించడానికి తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అతి ముఖ్యమైనదన్నారు. 18 ఏళ్లు పైబడిన వారందరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలో అన్ని ప్రభుత్వ ప్రైవేటు డిగ్రీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌లతో సంప్రదించి 18 ఏళ్లు నిండిన వారు ఇంకా ఓటర్‌గా నమోదు చేసుకోకుంటే ఓటుహక్కు కల్పించే విధంగా చూడాలన్నారు. నియోజకవర్గాల వారీగా జిల్లాలో అర్హులైన ఓటర్లు వంద శాతం నమోదు కావాలన్నారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలు ఉంటే వెంటనే తమకు తెలియజేయాలన్నారు. అన్నమయ్య నూతన జిల్లాలో 2024 సంవత్సరం ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆజంపేట ఆర్డీఓ రామకృష్ణరెడ్డి, తహసీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఓటరు జాబితా రూపకల్పన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

'ఆరోగ్య సురక్ష'తో ప్రజల చెంతకే వైద్యం

రాయచోటి : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నిర్వహిస్తున్న ఉచిత వైద్య పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ఎంఎపీ హెల్త్ మొబైల్ యాప్‌లో సమాచారాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని, బీపీ, షుగర్ మరియు హెచ్‌బీ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని, చంటిపిల్లలు, గర్భిణులు దివ్యాంగులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రాయచోటి మండలంలోని కాటిమాయకుంట గ్రామంలో మంగళవారం ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆరోగ్య సురక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను, 104 వాహనాన్ని, వైద్యులు ఉచితంగా నిర్వహిస్తున్న పరీక్షలను, అందజేస్తున్న మందులను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. దివ్యాంగులకు, చంటి బిడ్డలకు మరియు గర్భవతులకు త్వరగా పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అవసరమైతే ఇంకొక వైద్యుడి సేవలను ఉపయోగించుకోవాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, డీఎం అండ్ హెచ్‌ఓ కొండయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘర్షణ కేసులో అరెస్టు

పెనగలూరు : మండలంలోని ముద్రపల్లి పంచాయతీ, గోవిందంపల్లి గ్రామానికి చెందిన రెండు వర్గాలు ఇంటి స్థలం విషయమై ఘర్షణ పడిన కేసుకు సంబంధించి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. జూన్ నెలలో వీరు గొడవపడటంతో అప్పట్లో కేసు నమోదు చేశారు. స్టేషన్ బెయిల్ మంజూరు చేసినప్పటికీ గాయపడిన వారి రిపోర్టును వైద్యులు పోలీసు స్టేషన్‌కు పంపడంతో వారిని అరెస్టు చేసి మంగళవారం కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అన్న, చెల్లెలిపై దాడి కేసులో ముగ్గురి అరెస్టు

మదనపల్లె : మండలంలోని సీటీఎం సోమలగడ్డ ఎస్టీ కాలనీలో అన్నాచెల్లెలుపై ఈనెల 23న కత్తులతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. బాలాజీనగర్‌కు చెందిన గాలేటి శ్రీనివాసులు(45) సోమలగడ్డ ఎస్టీ కాలనీలో ఉన్న తన చెల్లెలు చంద్రకళ ఇంటివద్ద ఉండగా, అదే కాలనీకి చెందిన గంగాధర(39), రంగనాథ్(59), నవీన్(26)లు వినాయకచవితి చందా విషయమై గొడవ పెట్టుకుని కత్తితో తీవ్రంగా గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన తాలూకా పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

అత్తింటి వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : అత్తింటి వేధింపులపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మదనపల్లె మండలం బసినికొండకు చెందిన సరిత(36)కు చంద్రశేఖర్‌తో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి 16 ఏళ్ల కుమార్తె ఉంది. స్వస్థలం కర్నాటకలోని రాయల్పాడు. అయితే భవన నిర్మాణ కార్మికుడిగా జీవనం సాగిస్తూ బసినికొండలో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా భర్త వేరొక మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ భార్యపై వేధింపులకు పాల్పడుతున్నాడు. భర్తతో పాటు ఆమె తల్లి విజయమ్మ కూడా వేధింపులకు గురిచేస్తోంది. దీంతో బాధితురాలు సరిత తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు భర్త చంద్రశేఖర్, అత్త విజయమ్మపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడి అరెస్టు

చింతకొమ్మదిన్నె : మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడిని అరెస్టు చేసినట్లు సీకే దిన్నె ఎస్‌ఐ బి.అరుణ్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండలంలోని బుగ్గలేటిపల్లె గ్రామానికి చెందిన తోట సురేంద్ర అనే యువకుడు ఈనెల 21న అదే గ్రామానికి చెందిన బత్తల కళావతి అనే మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ కృష్ణారావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

మదనపల్లె : జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ కృష్ణారావు తెలిపారు. మదనపల్లె పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన వన్‌టౌన్, టూటౌన్, తాలూకా పోలీస్ స్టేషన్లను, చీకలబైలు బార్డర్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. విధి నిర్వహణపై పోలీస్ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులకు పలు సూచనలిచ్చారు. అనంతరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. మదనపల్లె తాలూకా పరిధిలో కొండామార్రిపల్లెలో జరిగిన రైతు రాజారెడ్డి హత్య కేసుకు సంబంధించి దర్యాప్తు జరుగుతోందన్నారు. కొన్ని ఆధారాలు సేకరించామని, పూర్తి వివరాలతో త్వరలో నిందితులను మీడియా ముందు ప్రవేశపెడతామన్నారు. కర్ణాటక సరిహద్దు సమీపంలో ఉండటం, జిల్లాలో మదనపల్లెలో నేరాల సంఖ్య అధికంగా ఉన్నందున ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. అలాగే వాహనదారుల నిర్లక్ష్యంతోనే జిల్లాలో రోడ్డుప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, భద్రతా నియమాలు పాటిస్తే చాలావరకు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. రోడ్ సేఫ్టీ వాహనాన్ని ఏర్పాటు చేసి, హెల్మెట్ ధరించడం, రహదారి సూచనలపై ప్రజలకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. మదనపల్లెలో గంజాయి, మద్యం, నాటుసారా అమ్మకాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక స్టేషన్ ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా అంగళ్లులో జరిగిన ఘటనలపై పోలీసు దర్యాప్తు కొనసాగుతోందని, కేసులో మరిన్ని సాక్ష్యాధారాలను సేకరించి, పకడ్బందీగా విచారణకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్, తాలూకా సీఐలు మహబూబ్‌బాషా, సత్యనారాయణ, ఎస్‌ఐలు సుధాకర, వెంకటేష్, హేమాద్రి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాస్కెట్‌బాల్ అండర్–14 బాల బాలికల జట్ల ఎంపిక


ఎంపికైన బాలికల జట్టు


ఎంపికైన బాలుర జట్టు

మదనపల్లె సిటీ : మదనపల్లె బీటీ కాలేజీ బాస్కెట్‌బాల్ మైదానంలో మంగళవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ -14 బాల బాలికల బాస్కెట్‌బాల్ జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమానికి జిల్లాలోని పలు పాఠశాలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన డీవైఈఓ క్రిష్టప్ప మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడలతో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంత మాట్లాడుతూ బాల బాలికల జట్లలో 20 మందిని ఎంపిక చేశామన్నారు. త్వరలో రాష్ట్ర స్థాయి అండర్–14 బాస్కెట్‌బాల్ పోటీలు మదనపల్లెలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు నరేంద్ర, సాయిశేఖర్‌రెడ్డి, సలీం, మదనపల్లె బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కోచ్ నటరాజ, పీడీలు రాంబాబు, సుధాకర్, అజీమ్, వెంకటేష్, మొయినుద్దీన్, భారతి, రాధిక, రమేష్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

భార్య, మామపై అల్లుడి హత్యాయత్నం

- ఇద్దరి పరిస్థితి విషమం
- డబ్బు విషయంపై గొడవ
- కేసు నమోదు




గాయపడిన అపూర్వ, చంద్రశేఖర్, నిందితుడు దేవరాజు(ఫైల్)

ములకలచెరువు : ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యపై భర్త కత్తితో దాడి చేస్తుండగా అడ్డొచ్చిన మామపై కూడా అల్లుడు విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మంగళవారం ములకలచెరువు మండలంలో చోటుచేసుకుంది. సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ గాయత్రి కథనం మేరకు వివరాలు.. మండలంలోని దేవులచెరువు పంచాయతీ రాజుగారిపల్లెకు చెందిన చంద్రశేఖర్, వసంతమ్మ కుమార్తె అపూర్వ(25)కు అదే గ్రామానికి చెందిన దేవరాజుతో ఏడేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వీరంతా అపూర్వ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారు. కొన్ని రోజుల క్రితం టమాట డబ్బులు రూ. 2 లక్షలు అల్లుడు వాడుకున్నాడని మామ చంద్రశేఖర్ అడగడంతో అప్పుల వాళ్లకు కట్టినట్లు చెప్పాడు. డబ్బుల విషయమై ఇంట్లో గొడవ జరిగింది. దీంతో అత్తామామల ఇంట్లో ఉండకుండా భార్య, పిల్లలతో దేవరాజు వేరుగా కాపురం పెట్టాడు. డబ్బుల విషయంపై తరచూ దేవరాజుకు, అతని భార్య అపూర్వకు మధ్య గొడవ జరిగేది. దీంతో రెండు రోజుల క్రితం ఆమె అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. డబ్బు విషయమై తనను అవమానించారని భార్య, మామపై కక్ష పెంచుకున్న దేవరాజు తన భార్య అపూర్వ పొలం వద్ద పనులు చేసుకుంటుండగా ఆమెపై కత్తితో దాడికి దిగాడు. గమనించిన మామ చంద్రశేఖర్ అడ్డురావడంతో మామపై కూడా దాడిచేసి పారిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం తంబళ్లపల్లె పీహెచ్‌సీకి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచనతో తిరుపతికి తరలించారు. సీఐ శివాంజనేయులు రాజుగారిపల్లెకు వెళ్లి జరిగిన సంఘటనపై విచారించారు. అపూర్వ తల్లి వసంతమ్మ ఫిర్యాదుతో దేవరాజుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లెకు చెందిన అబ్దుల్లా కుమారుడు మాలిక్‌బాషా(28) కుటుంబ సమస్యలతో ఇంటి వద్ద మద్యంలో పురుగుమందు కలుపుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదేవిధంగా మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద నివాసం ఉంటున్న రామయ్య కుమారుడు సి.శంకర(38) పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆయా ఘటనల్లో బాధితులను కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య


విద్యార్థిని మృతదేహాన్ని పరిశీలిస్తున్న వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా

మదనపల్లె : పరీక్షల్లో సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో నెలరోజులుగా ఇంటిపట్టునే ఉంటున్న డిగ్రీ విద్యార్థిని మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. పట్టణంలోని షానవాజ్‌వీధిలో నివాసం ఉంటున్న బ్యాంక్ మెసెంజర్ జయంతికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహమైంది. చిన్నకుమార్తె స్నేహలత(22) పట్టణంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బీసీఏ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఇటీవల విడుదలైన సెమిస్టర్ ఫలితాల్లో సబ్జెక్టులు తప్పిపోవడం, చదువుపై శ్రద్ధ తగ్గడంతో నెలరోజులుగా కాలేజీకి వెళ్లలేదు. దీంతో చదువుకోవాలని తల్లి ఒత్తిడి చేయడంతో మనస్తాపంతో ఇంట్లోని గదిలో తలుపునకు గడియ పెట్టుకుని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు దారితీసిన కారణాలను తల్లిని అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలిక హత్య కేసు నిందితులను శిక్షించాలి


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : ఈనెల 17వ తేదీన చిత్తూరు జిల్లా వేణుగోపాలపురం గ్రామానికి చెందిన మునికృష్ణ, పద్మావతిల కుమార్తె భవ్యశ్రీని అతి క్రూరంగా హింసించి హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్‌ఆర్‌ఐ వడ్డెర సంఘం అధ్యక్షుడు బత్తల లక్ష్మయ్య, బీసీ మానిటరింగ్ సభ్యుడు బత్తల సుబ్రమణ్యంలు డిమాండ్ చేశారు. చిట్వేలి రోడ్డులోని జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు వడ్డెర సంఘం నాయకులు, సభ్యులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బత్తల లక్ష్మయ్య మాట్లాడుతూ మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సమాజాన్ని మేల్కొలిపి యువతులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ వడ్డెర కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, నాగరాజు, సుధాకర్, ఎంపీటీసీ శివయ్య, మల్లికార్జున, సిద్దేశ్వర, రమణ, రామకృష్ణ, వెంకటరమణ, జయభేర్, సుబ్రమణ్యం, బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ చోరీ చేస్తూ పట్టుబడిన విద్యార్థులు

ఎన్పీకుంట : అనంతపురం జిల్లా ఎన్.పి.కుంట మండలంలోని జౌకల గ్రామానికి చెందిన రైతులు అప్పిరెడ్డి, వెంకట్రామిరెడ్డి పొలాల వద్ద విద్యుత్ మోటార్‌కు అమర్చిన కేబుల్ చోరీ చేస్తూ ఇద్దరు విద్యార్థులు పట్టుబడ్డారు. మంగళవారం ఉదయం అటుగా వచ్చిన విద్యార్థులు విద్యుత్ కొక్కేలను తొలగించి కేబుల్‌ను కత్తిరించుకుని పారిపోతుండగా గ్రామస్తులు వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన విద్యార్థులు అన్నమయ్య జిల్లా కల్లూరుపల్లికి చెందిన అన్నదమ్ములుగా పోలీసులు గుర్తించారు. ఎన్పీ కుంటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఒకరు పదో తరగతి, ఇంకొకరు తొమ్మిది తరగతి చదువుతున్నారు. విషయం తెలుసుకున్న జౌకల, మరికొమ్మదిన్నె, మండెంవారిపల్లి, ఎన్పీ కుంట గ్రామాలకు చెందిన పలువురు రైతులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని మూడు నెలలుగా తమ పొలాల్లోని దాదాపు 5వేల మీటర్లకు పైగా కేబుల్ అపహరణకు గురైందని ఫిర్యాదు చేశారు. విచారణలో అపహరించిన కేబుల్‌ను గాలివీడులోని ఓ గుజరీ దుకాణంలో విక్రయించినట్లు విద్యార్థులు అంగీకరించారు. విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి, ఆర్బీకే చైర్మన్ ఆదినారాయణరెడ్డి, నాయకుడు తిరుమలనాయుడు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేసు నమోదు కాకుండా కౌన్సెలింగ్‌తో సరిపెట్టాలని, అయితే వీరి వెనుక ఉన్న అసలు సూత్రధారిని గుర్తించి బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లాకు పతకాల పంట


పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న డీఈఓ వై. రాఘవరెడ్డి

కడప స్పోర్ట్స్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా నున్నలో నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ పోటీల్లో వైఎస్సార్ జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో వివిధ కేటగిరీల్లో అండర్–14, అండర్–17 బాలబాలికల విభాగాల్లో మొత్తం 14 పతకాలు సాధించారు. వీరిలో అండర్–14 బాలికల విభాగంలో కె. వెంకటలక్ష్మి, అండర్–17 బాలుర విభాగంలో 65 కేజీల విభాగంలో పి. వెంకట రిషికిరణ్, 71 కేజీల విభాగంలో జి. వినయ్‌లు స్వర్ణపతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా విద్యాశాఖాధికారి వై. రాఘవరెడ్డి మంగళవారం డీఈఓ కార్యాలయంలో అభినందించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్. వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, సాజిత్, నిత్య ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు భారతి డీఏవీ విద్యార్థులు


ప్రణవి, పూజలను అభినందిస్తున్న గోపాల్‌రెడ్డి, కిషోర్‌కుమార్

కమలాపురం : మండల పరిధిలోని నల్లింగాయపల్లెలో వెలసిన భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) లోని డీఏవీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ తెలిపారు. సోమవారం వేంపల్లెలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్ ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అండర్–17 బాలికల విభాగంలో భారతి డీఏవీకి చెందిన వి.ప్రణవి రెడ్డి (9వ తరగతి), అండర్–14 బాలికల విభాగంలో కె.పూజ (7వ తరగతి) హాజరై అత్యున్నత ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాగా మంగళవారం వారిని డీఏవీ పాఠశాలలో హెచ్‌ఆర్ చీఫ్ మేనేజర్ గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ కిషోర్ కుమార్‌లు అభినందించారు. అలాగే రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం మంచి ప్రతిభ కనబరిచి రాణించాలని విజేతలకు సూచించారు. పీఈటీ చందును వారు అభినందించారు.

బాల్యవివాహాలకు పాల్పడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ

కడప కల్చరల్ : బాల్య వివాహాలకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ హెచ్చరించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో జిల్లాకు చెందిన అన్ని ప్రభుత్వ, ప్రైవేటు దేవాలయాల అర్చకులు, ఈఓలు, ఆలయ కమిటీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు జిల్లా యంత్రాంగం బాల్యవివాహాల నిషేధానికి గట్టి చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం బాలికలకు 18, బాలురకు 21 సంవత్సరాలు నిండి ఉంటేనే వారికి వివాహం చేయవచ్చన్నారు. ఆ లోపు వయస్సు వారికి వివాహం చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఆలయ అధికారులు ఆ జంటల వయసును గురించి కచ్చితమైన ఆధారాలు ఉన్నట్లు ధ్రువీకరించుకున్న తర్వాతే వారిని వివాహాలు చేసుకునేందుకు అనుమతించాలని సూచించారు. ఆలయాల అర్చకులు, ఈఓలు ఈ విషయంగా ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎక్కడైనా ఇలాంటి వివాహాలకు పాల్పడితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 100, 1098 కి ఫోన్ చేసి తెలపాలని సూచించారు. అర్చక సమాఖ్య అధ్యక్షుడు విజయ భట్టర్ మాట్లాడుతూ హిందువుల వివాహాలు ఎక్కువగా దేవాలయాలలోనే జరుగుతాయని, అందుకే అర్చకులు, ఈఓలు ఈ విషయంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంఘం ఉపాధ్యక్షులు పలువురం హరి ప్రవీణ్, ప్రశాంత్, ఇంద్రగంటి ప్రశాంత్ శర్మ, కొప్పర్తి ప్రసాద్‌శర్మ, సుదర్శనాచార్యులు, కిరణ్, సుధీర్, మహేశ్వరాచారి పాల్గొన్నారు.

నేషనల్ హాకీ క్యాంపునకు క్రీడాపాఠశాల విద్యార్థులు


తులసిని అభినందిస్తున్న ప్రత్యేకాధికారి, కోచ్


గోల్‌కీపర్‌గా ఎంపికైన శైలజ

కడప స్పోర్ట్స్ : ఈనెల 21 నుంచి అక్టోబర్ 20వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రం రూర్కెలాలోని బిర్సా ముండా హాకీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఆలిండియా సబ్‌జూనియర్ హాకీ మహిళా కోచింగ్ క్యాంపునకు కడప వైఎస్ఆర్ క్రీడాపాఠశాలకు చెందిన క్రీడాకారిణులు ఎంపికయ్యారు. పాఠశాలలో పదోతరగతి చదువుతున్న కుప్పా తులసి, పూర్వ విద్యార్థి టి. శైలజలు అండర్–16 విభాగంలో కోచింగ్ క్యాంపునకు ఎంపికయ్యారు. ఈ క్యాంపులో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే భారత సబ్‌జూనియర్ మహిళా హాకీ జట్టుకు ఎంపికయ్యే అవకాశం ఉందని క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి జగన్నాథరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో హాకీ కోచ్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

చింతకొమ్మదిన్నె : మండలంలోని రాజుల తాతయ్యగారిపల్లికి చెందిన బత్తల నాగేంద్ర (50) అనే వ్యక్తి మంగళవారం ఊరి బయట ఉన్న వేప చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు సీకేదిన్నె ఎస్‌ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపారు. మృతుడు తాగుడుకు బానిసై ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసిందన్నారు. ఇతనికి భార్యతో పాటు, కుమారుడు, కుమార్తె ఉన్నారన్నారు. మృతుడి కుమారుడు లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అవయవదానంపై అవగాహన అవసరం


అవయవదానం ప్రతిజ్ఞ చేయిస్తున్న రిమ్స్ అధికారులు

కడప అర్బన్ : ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంచుకోవాలని కడప రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు అవయవదానంపై అవగాహన పెంచేందుకు కడప రిమ్స్ ఐపీ విభాగంలో లెక్చర్ హాలులో రిమ్స్ వైద్య విద్యార్థులు, నర్సింగ్, వైద్యులు, స్టాఫ్ నర్సులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సురేఖ, సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ రాజేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా దాదాపు 500 మంది అవయవదానం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సిద్ధపడ్డారు. స్వచ్ఛందంగా అవయవదానం రిజిస్ట్రేషన్ ప్రతిజ్ఞను అధికారులు చేయించారు.

వన్డే టోర్నీలో బౌలర్ల హవా

సౌత్‌జోన్, నార్త్‌జోన్, నెల్లూరు జట్ల విజయం




5 వికెట్లు తీసిన నెల్లూరు బౌలర్ మాధవ్, విజయనగరం బౌలర్ దుర్గాకుమార్, నార్త్‌జోన్ బౌలర్ సాయిశ్రావణ్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో బౌలర్ల హవా కొనసాగుతోంది. మంగళవారం వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో కృష్ణా జట్టు, నార్త్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నార్త్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 49 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 245 పరుగులు చేసింది. జట్టులోని సాయిశ్రావణ్ 71 పరుగులు, హర్షవర్ధన్ 68 పరుగులు, రాహుల్ 55 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్లు సుశాంత్‌నాయుడు 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 49 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 216 పరుగులు మాత్రమే చేయగలిగింది. జట్టులోని బ్రహ్మతేజ 54 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్లు సాయిశ్రావణ్ 5 వికెట్లు, శ్రీకర్‌సాయిరెడ్డి 2 వికెట్లు తీశారు. దీంతో నార్త్‌జోన్ జట్టు 29 పరుగుల తేడాతో విజయం సాధించింది.

సౌత్‌జోన్ జట్టు విజయం..

కేఎస్‌ఆర్ఎం మైదానంలో సౌత్‌జోన్, సెంట్రల్‌జోన్ జట్లు తలపడ్డాయి. వర్షం కారణంగా ఓవర్లను కుదించారు. టాస్ గెలిచిన సౌత్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 25 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. జట్టులోని ధరణి కుమార్‌నాయుడు 73 పరుగులు, ఇస్మాయిల్ 47 పరుగులు చేశారు. సెంట్రల్‌జోన్ బౌలర్ వెంకటసుమిత్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ జట్టు 23.3 ఓవర్లలో 120 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సిద్ధార్థ 46 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ బౌలర్లు సంతోష్ 4, ఇస్మాయిల్ 3 వికెట్లు తీశారు. దీంతో సౌత్‌జోన్ జట్టు 45 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

నెల్లూరు జట్టు విజయం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విజయనగరం, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన విజయనగరం జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 40.4 ఓవర్లలో 204 పరుగులు చేసింది. జట్టులోని నిఖిలేశ్వర్‌రెడ్డి 37 పరుగులు చేశాడు. విజయనగరం బౌలర్ దుర్గాకుమార్ 5 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు 39.2 ఓవర్లలో 175 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని హరీష్ 45 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు మాధవ్ 5 వికెట్లు, అఖిల్ 2 వికెట్లు తీశారు. దీంతో నెల్లూరు జట్టు 29 పరుగుల తేడాతో విజయం సాధించింది.

ఫోర్జరీ కేసులో నిందితుల అరెస్టు


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ

పులివెందుల రూరల్ : చుక్కల భూములకు ఎన్‌ఓసీ పేరుతో ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ రాజు తెలిపారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన కంప్యూటర్, మానిటర్, సీపీయూ ప్రింటర్ ఇతర కంప్యూటర్ వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. మంగళవారం రాత్రి పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. నిందితులు శ్రీపతి శ్రీనివాసులు, వీఆర్‌ఓ గూడూరు కళానందరెడ్డి, సర్వేయర్లు అంజిరెడ్డి సందీప్‌రెడ్డి, చీపాటి వాసుదేవరెడ్డి ఫోర్జరీకి పాల్పడ్డారన్నారు. విద్యానందరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. తక్కువ సమయంలో సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో పులివెందుల టౌన్‌లోని చుక్కల భూములు, డీకేటీ భూములు ఎంచుకుని ఆ భూములకు కలెక్టర్ ద్వారా ఎన్‌ఓసీ పత్రాలు తెప్పిస్తామని సంబంధిత భూ యజమానులను నమ్మించారు. ఈ విధంగా పలువురి నుంచి లక్షల్లో డబ్బులు వసూలు చేశారు. నిందితులకు ఉన్న కంప్యూటర్ పరిజ్ఞానంతో నకిలీ ఎన్‌ఓసీ పత్రాలు సృష్టించారు. అలాగే అధికారి సంతకం ఫోర్జరీ చేసి నిజమైన ఎన్‌ఓసీ పత్రంగా నమ్మించారు. దీంతో పులివెందుల టౌన్‌లోని చుట్టు పక్కల భూములససర్వే నంబర్లు 99-3, 99-1,-2ఎ2-2ఏ, 0-2, 135-3, 45-2,135, -258-2,98-1ఏ, మొత్తం 30 ఎకరాలలో రిజిస్టర్ చేయించి డబ్బులు వసూలు చేశారు. అవి ఫోర్జరీ పత్రాలని తేలడంతో నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు వారిని పట్టణంలోని కోర్టు సర్కిల్ వద్ద ఎస్‌ఐ సత్యనారాయణ అరెస్టు చేశారు. అనంతరం వారిని కోర్టులో హాజరు పరిచారు. సమావేశంలో ఏఎస్‌ఐ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.